# నారాయణ...నారాయణ

– తోలేటి జగన్మోహనరావు

లేట్ శ్రీమన్నారాయణగారికి ఆ దృశ్యం తమాషాగా కనిపిస్తోంది. బెడ్‌మీద 'తన'ని, పక్కనపడుకున్న భార్యని, బెడ్‌పక్కన ఉన్న లేంప్‌ని, మధ్యలో సెంటర్ టేబులుని, దానిమీద ఫ్లవర్‌వేస్‌ని - అన్నింటిని పైనుంచి చూస్తున్న ఆయన - 'ఇదేవిటి? నా శరీరాన్ని నేనెలా చూస్తున్నాను? ఇది కలా ? నిజమా ?' అని ఓసారి గిల్లుకోబోతుండగా. అరుంధతీదేవి లేచి మంగళసూత్రాలు కళ్ళకద్దుకుని, రోజులాగే శ్రీమన్నారాయణగారి పాదాలకు నమస్కరించబోయి, అవి చల్లగా తగలడంతో ఉలిక్కిపడి, తర్వాత జరిగింది గ్రహించి గొల్లుమంది.

క్షణాలలో మంత్రి శ్రీమన్నారాయణగారి మరణవార్త నగరమంతా వ్యాపించింది. ప్రభువుల వారు - అంటే ముఖ్యమంత్రిగారు - ఉదయవేళ యోగాసనాలు వేస్తుండగా శ్రీమన్నారాయణగారి మరణవార్త అందింది.

పద్మాసనంలో ఉన్న ఆయన ఆ దుర్వార్త వినగానే కళ్ళుమూసుకుని గుండెల నిండా గాలి మెల్లగా పీల్చి, ఛాతీ పొంగించి, ఓ అరనిమిషం గాలి స్తంభింపచేసి, తర్వాత నోరు సున్నాలా చేసి బుస్సుమని గాలివదులుతూ, గాలి తీసిన బెలూన్లా డీలా అయిపోయి, ఆ స్థితిలో మరో అరనిమిషం వుండి, తర్వాత కళ్ళు బరువుగా తెరిచి, అటూ ఇటూవున్న పత్రికల వాళ్ళకేసి తడికళ్ళతో చూసి, గద్గదకంఠంతో, 'మా కుడిభుజం కూలిపోయింది' అని పక్షవాతం వచ్చినట్లు కుడిచెయ్యి వేలాడదీసి, మెడ వాల్చేశారు.

'సచ్చిన కోడిలా మెడవాల్చేశాడు ఈడుకూడా బాల్చీ తన్నేశాడో' - అని ప్రభువుల వారి ఎడం భుజం ఆత్రతగా, ఆశగా చూస్తుండగా, గాలి కొడుతుంటే ఫుట్‌బాల్ బ్లేడరు పొంగినట్లు, ప్రభువులవారు మెల్లిగా పొంగుతూ పూర్వపు ఆకారంలోకి వచ్చేసి, వైరాగిలా చిరునవ్వు నవ్వుతూ, 'జాతస్య మరణం ధ్రువమ్' అన్నారు ఫిలసాఫికల్‌గా.

'ఆహా - ఏం రంగులు మారుస్తారు గురువు గారు - పూర్వజన్మలో ఉడతైవుండాలి' అన్నాడు మెల్లిగా ఒక జర్నలిస్టు తన సీనియర్‌తో.

'ఉష్ - రంగులు మార్చేది ఉడతకాదు - ఊసరవెల్లి', అన్నాడు సీనియర్ జూనియర్‌ని మందలిస్తూ ......

స్వగృహంలో హాలులో ఉంచబడిన శ్రీమన్నారాయణగారి భౌతికకాయానికి అందరూ శ్రద్ధాంజలి ఘటించి వెడుతుండగా, ఒకరు పొరపాటున శ్రీవారి పాదరక్షలు ధరించి బయటకు నడవబోయారు.

ఎవరో అవి శ్రీవారి పాదరక్షలుగా గుర్తించి, 'అరే - ఇవి మీకు సరిగ్గా సరిపోయాయే', అని ఆయన్ను అభినందిస్తుండగా, మరొకరు ఈసారి ఉద్దేశపూర్వకంగానే శ్రీవారి టోపీ తన నెత్తికి తగిలించుకున్నారు.

'అరే - ఇది మీకోసమే కుట్టించినట్లు ఎంత చక్కగా అమిరిందీ', అని ఆయన వంది మాగధులొకరు పొగిడారు.

'అయితే మంత్రిపదవి మీదే' అంటూ రెండో వంధిమాగధుడు శవాలంకరణకు తీసుకు వచ్చిన దండల్లో ఒకోదండ తీసి ఆయన మెళ్ళో వేశారు అభినందిస్తూ.

'అయ్యా - తవరు పొరబడుతున్నారు - శ్రీవారి పాదరక్షల్లో - ఇంగ్లీషునాడు 'స్టెప్టింగ్ ఇంటూ షూస్' అంటాడే - అలా మా గురువుగారు మొదట అడుగువేశారు. అంచేత ఆయనే మంత్రి అవాలి , అని వివరించారు మొదటి పక్షంవారు.

తల ముఖ్యం కాబట్టి టోపీదానుగారే మంత్రి అవాలి అని పట్టుబట్టారు. ఆయన అభిమానులు.

'అయ్యా! ప్రభువుల్ని పొగిడే నోరూ, వారి పాదపూజ చేసే చేతులూ, సీటుదాకా నడిచి వెళ్ళేకాళ్ళూ - ఈ మూడున్నూ పంచేంద్రియాలుగా శాస్త్రకారులు సెలవిచ్చారు. అందులోనూ, తతిమ్మా రెండునూ పాదాలను సీటుదాకా నడిపించే కార్యక్రమం నిర్వర్తించడానికే ఉద్దేశించబడ్డవి కాబట్టి, 'సర్వేంద్రియా పాదమ్ ప్రధానమ్' అన్నారు కూడా ! అంచేత ధర్మానుసారం పాదరక్షలు మోస్తున్న భరతుడుగారే శ్రీవారి కుర్చీకి అర్హులు' అని ధర్మ సూక్ష్మాన్ని వివరించారు శాస్త్రులు గారు.

తల ముఖ్యమా, పాదాలు ముఖ్యమా అనే వాదం వివాదంగా మారి రెండు గ్రూపులూ చెయ్యీ చెయ్యీ కలిపేటప్పటికి పెద్దలు కలుగజేసుకుని, ఈ విషయం గురించి పార్టీ హైకమాండు విచారిస్తుందని నచ్చచెప్పి, ఇరుపక్షాలవారినీ శాంతింపజేస్తుండగా 'ఓర్నా దేవుడోయ్ - నన్నుకూడా తీసుకుపోరా నా దేవుడోయ్', అంటూ పెద్ద పెట్టున ఏడుస్తూ అరుంధతాదేవి సుడిగాలిలా దూసుకువచ్చి శ్రీవారి పాదాల మీద వాలిపోయింది.

'అమ్మా! అమ్మా! అరుంధతమ్మా! పోయినోళ్ళతో మనవూ పోతామా - తప్పుకాదూ సమ్మాళించుకోండమ్మా', అని ఓదార్చసాగారు ఆప్తులు.

'ఇంక సమ్మాళించుకునేదేంటి దేవుడోయ్ - అయనెల్లి పోయాకా ఈ బతుకెందుకు? ఆయనతో పాటే నన్నూ తగిలేసేండ్రోయ్', అంటూ సహగమనం చేస్తానని ప్రకటించి, ఇంకోపుట్టెడు కట్టెలతో డబుల్ బెడ్ ఏర్పాటు చెయ్యమంది సతీఅరుంధతి.

హాలులో, ఫేను రెక్కమీద కూర్చుని అంతా చూస్తున్న శ్రీవారి కళ్ళుచెమ్మగిల్లాయి - ఈ పిచ్చిమొహం నేను లేకపోతే ఎలా

బతుకుతుందో ఏవిటో' అని ఆయనకు దుఃఖం ముంచుకొచ్చింది.

'అమ్మా! మీకు ఈ బతుకు అక్కర్లేదు - నిజమే - మరి మాకు కావాలే - మీ బిడ్డల్ని ఇలా అనాధల్ని చేసి మీరూ వెళ్ళిపోతే ఎలా ? అనలే నాన్నగారు పోయి గుండెవగిలి మేమేడుస్తుంటే మీరుకూడా ఇలా అంటే మేము ఏవైపోవాలి? దేశం ఏవైపోవాలి? అమ్మా - ఈ కుర్చీలో కూర్చుని కొంచెం శాంతించండమ్మా అంటూ బిడ్డలు శ్రీవారి కుర్చీ తీసుకువచ్చి అక్కడ వేశారు. ఆవిడ తక్కున ఏడుపాపి, బిడ్డల కోరిక మన్నించి శ్రీవారి పాదాల దగ్గరనుంచి లేచి కుర్చీలో కూర్చుని శాంతించింది.

'గోవిందా ....' అన్నారు ఎవరో.

అది శవం లేపమన్న సూచనో లేక కుర్చీ గోవింద కొట్టిందని చెప్పడమో అర్థం కాక టోపీదాసరిగారూ, భరతుడుగారూ ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకున్నారు అయోమయంగా.

చివరకు శాస్త్రులుగారు, 'ఆవిడని ఈ సమయంలో ఇక్కడ కూర్చోబెట్టడం ఏం



బావుంటుంది చెప్పండి - లోపలకు తీసుకెళ్ళి విశ్రాంతి తీసుకోనివ్వండి - ఈ పదిరోజులూ అయ్యాక ఆ విషయాలు చూసుకోవచ్చు', అన్నారు పెద్ద మనిషి తరహాగా.

'అమ్మ - మీ దొంగెత్తు మాకు తెలీదా స్టెప్పింగ్ ఇంటూ షూస్' అన్నముండాకొడుకే 'స్ట్రైక్‌ది ఐరన్ వ్హెన్ ఇటీజ్ హాట్' అన్నాడు. మేవూ ఇంగ్లీషు చదువుకున్నాం - మాకూ రాజనీతి, మంత్రినీతి అన్నీ తెల్సు - అమీ తుమీ ఇప్పుడే తేల్చుకోకపోతే ఎలా ?' అన్నారు ఆమె బిడ్డలు, అంతవరకు ఏకధారగా కారుస్తున్న కన్నీళ్ళు ఆపి, కళ్ళెర్రజేస్తూ.

'అయితే తేల్చుకుందామా?' అన్నారు టోపీదాసరిగారు లేస్తూ .

'తేల్చుకుందామా?' - అన్నారు భరతుడుగారు సిల్కుఖాదీ లాల్చీ చేతులు పైకి మడుస్తూ.

'ఇంకా నా శవమైనా లేవలేదే - ఇక్కడే వీళ్ళు ఇలా కొట్టుకు చచ్చిపోతున్నారే', అని శ్రీవారు బాధపడుతుండగా, ఎవరో జరగవలసిన దాన్ని గురించి హెచ్చరించారు. అంతా ఆగ్రహపూరిత వదనాలను విషాదవదనాలుగా మార్చేసి శ్రీమన్నారాయణగారి భౌతికకాయాన్ని అతిశ్రద్ధతో లేవదీసి, పూలమాలలతో అలంకరించపబడిన వాహనం మీద వుంచి రాజకీయాలు చర్చించుకుంటూ, వాదించుకుంటూ,దూషించుకుంటూ వాహనం వెనుకే నడవసాగారు....

'పంతులూ - నాకు తెలీక అడుగుతాను ఇంట్లో అడుగు పెట్టినాడి సూపు ఇనప్పెట్టిమీది కెల్తాది కాని - దీనమ్మసిగతరగ -

ఈడిసూపు సెప్పులమీది కెల్లా పోయిందయ్యా'- ఈ మధ్యనే రాజమండ్రి సెంట్రలు జెయిలు నుంచి రాజకీయాల్లోకి గ్రాడ్యుయేటు అయిన క్రిమినల్ - పొలిటీషియన్ గారు సందేహం వచ్చి పంతులుగార్ని అడిగారు.

'మదమలిన గండకుంజరాల్లాంటి ఇనపబీరువాల మీదికి లంఘించడానికి అంతా తమవంటి వీరకిశోరాలే వుంటారా ప్రభూ - అల్పజీవులకు అల్ప బుద్ధులు .....

'అసలు అరుంధతమ్మగారికేం వొచ్చని ........'

'అదుగో మళ్ళీ - ఆవిడ నోటిపవరు నీకు తెల్సా - ఆవిడ చీపురుపుచ్చుకుని రంగంలోకి దిగిందంటే అనఫిషయల్‌గా ఎమర్జన్సీ డిక్లేర్ చేసినట్లే.........'

'ఆ టోపీ పెట్టుకుని కొవ్వుదాసరోడులా ఎలా కులుకుతున్నాడో చూశారా - వెధవ బోఫార్సు మొహం వాడూను.....' రుసరుసలాడుతున్న భరతుడుగారికి మళ్ళీ సందేహం వచ్చి దిగులుగా పక్కనున్నాయన్ని అడిగారు - 'పార్టీ హైకమాండు మనల్ని సపోర్టు చేస్తుందంటారా?'

'ఊరుకోండి వెధవ అపశకునం మాటలూ మీరూను - పార్టీ హైకమాండుకి బుర్రలక్కర్లేదు - అసలు సొంత బుర్రలుండడం పెద్ద డిస్క్వాలిఫికేషను కూడా - మీకేం ఎక్కువని అలా కంగారు పడి పోతారు?' - అభిమానంగా మందలించారు ఆయన అప్తులొకరు.

'పాపం - గురూగార్ని స్థిమితంగా కూర్చుని తిననిచ్చిందెప్పుడు? ముద్దు ముద్దకి ఎంక్వయిరీ కమిటీలు - హార్టటాక్ వచ్చిందంటే రాదా ?'

'ప్రభువుల వారి పక్కలో బల్లెంలా వుండేవారు - ఇంకో ఆర్నెల్లు ఆయన బతికుంటే ఈ హార్టటాక్ ప్రభువులవారికే వచ్చి, మన గురూగారు సియం అయిపోయేవారు,' శ్రీవారి కక్ష్యలో తిరిగే రెండు ఉపగ్రహాలు శోకించసాగాయి.

అయ్యో - ఇంకో ఆర్నెల్లు బతకలేకపోయానే', అని శ్రీవారి ఆత్మ విలపిస్తుండగా, ఆయన అంతిమయాత్ర ఇందిర ధర్మాసుపత్రి సెంటరుకి చేరింది.

ఆరోజు ముందు రెండు రోజులక్రితం సాయంత్రం వేళలో, అలవాటుగా దేవాలయానికి వెళ్ళి, ఓ గంట సేపు ధర్మోప న్యాసాలు విని, శాంతిపొందిన మనస్సుతో ఇంటికి తిరిగి వెడుతున్న ప్రముఖ సమాజ సేవకులు పద్మశ్రీ ధర్మారావుగారికి దేవాలయం మెట్లమీద అపస్మారకస్థితిలో పడున్న దరిద్ర నారాయణుడు కనిపించాడు.

'అయ్యో పాపం - ఈ దీనుడు ఇలా నిస్సహాయంగా పడి ఉన్నాడే', అని ధర్మారావు గారు కలత చెంది, దరిద్ర నారాయణుడిని తన కారులో ధర్మాసుపత్రికి తీసుకుపోయి, అక్కడ వదలి, ఇంటికి వెళ్ళి వేన్నీళ్ల స్నానం చేసి, భోంచేసి, తన గదిలోకి వెళ్ళి డైరీతీసి- 'ఈ రోజున నేను చేసిన మంచి పనులు' అనే శీర్షిక కింద ఆ విషయం వ్రాసుకుని తృప్తిగా, ఆనందంగా నిద్రపోయారు.

దరిద్రనారాయణుడుమాత్రం రెండు రోజుల్నుంచీతలనాపాలనా లేకుండా అపస్మారక స్థితిలో అలాగే పడున్నాడు ధర్మాసుపత్రిలో.

'ఏమిటికేసు?' - అనడిగాడు రెండు రోజుల తర్వాత ఓ యువడాక్టరు ఓ యువడాక్టరి కళ్ళల్లోకి చూస్తూ.

'ఏవిటో - ఎంత అడిగినా ఏం చెప్పడం లేదు - పేషంటు కో ఆపరేట్ చెయ్యకపోతే మనవేం చెయ్యగలం', అంది నిస్సహాయంగా, జాలిగా ఆ అమ్మాయి యువడాక్టరు కళ్ళల్లోకి చూస్తూ.

'నా కందుకనే ఈ జనాలన్నా, ఈ దేశవన్నా అసహ్యం - నేను రిజైన్ చేసి స్టేట్సుకి వెళ్ళిపోతున్నాను', అన్నాడు యువడాక్టరు.

'నిజంగా' అంది ఆ అమ్మాయి కళ్ళు పెద్దవి చేసి, ఆడవాళ్ళు ఎవరి మదినేనా కలవర పెట్టాలనుకున్నప్పుడు వాడే బ్రాండు కాటుక కళ్ళకు పెట్టుకునుంది యువడాక్టరి ఆ సమయంలో.

'నిజంగా', అన్నాడు యువడాక్టరు కొంచెం కలవరపడి.

'అసలు ప్రాణం వుందంటావా?' అన్నాడు మళ్ళీ యువ డాక్టరు, తన కలవరపాటును కప్పిపుచ్చుకుంటూ, దరిద్రనారాయణుడు కేసి తరిగి.

'అదే అడిగాను - పెదవి విప్పడే', మళ్ళీ బేలగా అని, 'సిస్టర్ - ఆపేషంటు పల్సుచూడు', అంది కాటుక కళ్ళ సుందరి, స్టేట్సు యాత్రలో మళ్ళీ దరిద్రనారాయణుడి ప్రస్తావన వచ్చినందుకు చికాకు పడుతూ.

సిస్టర్ ఓ కంటితో వారిని గమనిస్తూ, ఓ చెవితో వాళ్ళమాటలు వింటూ చాలా బిజీగా వుంది. ఆవిడకి అక్కడ్నుంచి ఆ సమయంలో కదలడం ఇష్టం లేదు. అంచేత ఆమె దరిద్రుడి బెడ్ దగ్గర నిలబడివున్న వార్డు బోయ్‌తో, 'పేషంటు పల్సు ,చూడు', అంది విసుగ్గా.

నిరోలాక్ సూపర్‌వైట్ పెయింటులో పీకలదాకా ముంచి తీసిన నల్లకాకిలా మెరుస్తున్న నర్సు ఒంపుసొంపులన్నీ కళ్ళతో తడుముతున్న వార్డుబోయ్, కళ్ళు తిప్పకుండానే చెయ్యి క్రిందికి పోనిచ్చి, దరిద్రుడి చెయ్యి పట్టుకోడానికి బదులు ఇనపమంచం రాడ్ పట్టుకుని, అది చల్లగా తగిలేసరికి ఠక్కున వదిలేసి, 'సచ్చి పోయాడు. అన్నాడు కళ్ళు తిప్పకుండానే.

'పేషంట్ డెడ్ అయిపోయాడు', అంది సిస్టర్.

'హి ఈజ్ డెడ్', అంది యువడాక్టరి విచారంగా.

'అయితే శవాన్ని వెంటనే మార్చురీకి చేర్పించండి', అన్నాడు యువడాక్టరు.

'తొమ్మిదో నెంబరు పేషంటు తాలూకు మనుషులెవరయ్యా' - హాలు బయటకూర్చున్న పేషంట్ల బంధువుల దగ్గరకు వెళ్ళి నిర్లక్ష్యంగా ఓ కేక వేశాడు. తోటీవాడు. ఎవరూ లేవలేదు.

'ఒళ్ళూ లేరా? పేషంటు నచ్చి పోయాడు', అనరిచాడు మళ్ళీ.

ఎవరూ లేవలేదు.

'వాళ్ళ వాళ్ళు వస్తారులే - నువ్వు శవాన్ని శవాల గదికి చేర్చు', అన్నాడు యువడాక్టరు.

'వాళ్ళ వాళ్ళకు రానీయ్', అన్నాడు తోటీవాడు.

వాళ్ళువాళ్ళు వస్తే కాని వాడికి డబ్బు రాలదు. డబ్బులు రాలితేగాని శవం శవాలగదికి చేరదు. కాని దరిద్రుడికి ఎవరూ లేరన్న సంగతి వాడికి మరో రెండు గంటల తర్వాత కాని అర్థం కాలేదు. అంతవరకు వార్డులోంచి బయటకు ఈడ్వబడి వరండాలో ఉంచబడ్డ దరిద్ర నారాయణుడి భౌతిక కాయానికి వచ్చి పోయేవాళ్ళందరూ భయ పడుతూ శ్రద్ధాంజలి ఘటించి వెడుతున్నారు.

'నువ్వేదన్నా ఇస్తావా - తొందరగా తీసికెళ్ళిపడేస్తా', అని వాడు శవంతో అన్నాడు కాని, 'కానీ విదల్చను - నీ ఇష్టం వచ్చినప్పుడు తీసుకెళ్ళుబే' అన్నట్లు శవం కాళ్ళు నిగడదన్ని పడుకుంది కాని పెదవి విప్పలేదు. చేతిలో మామూలు పడకుండా శవాన్ని శవాలగదికి చేర్చాలంటే వెట్టిచాకిరి చేసినట్లుంది వాడికి.

'యమ్మెస్ విజిట్ కొచ్చే టైమైంది శవం ఇక్కడుంటే ఆయన కోప్పడతారు', అందియువడాక్టరి.

'యమ్మెసొచ్చి నా వెంట్రుకలు పీకు తాడా - ఆడ్నీ నోరెత్తమను - నేను చిటికేసేనంటే స్ట్రైక్ - అప్పుడు ఆడూ, నువ్వూ మొయ్యాలి శవాల్ని, అంటూ తను ఓ పవర్‌ఫుల్ యూనియన్ లీడర్నన్న సంగతి దురుసుగా గుర్తుచేశాడు తోటీవాడు.

వాడినోటి దురుసుతనానికి యువ డాక్టరికి కళ్ళనీళ్ళొచ్చినంత పనైంది.

కాటుక కళ్ళ సుందరికి అలా కళ్ళనీళ్ళు తెప్పించిన తోటీవాడి మీద అవ్యాజానురాగం పొంగుకొచ్చిన నర్సు, 'చూడు శివుడూ - ఇది ధర్మారావుగారి కేసు - వీడికెవరూ లేరు - వెంటనే వీడిని ఇక్కడనుంచి తీసుకెళ్ళకపోతే ఇంకో మూడు నాలుగు శవాలు తయారవు తాయి - పేషంట్లంతా బయపడి సస్తున్నారు', అని నచ్చచెప్పింది.

ఆ నర్సు అలా మెత్తగా చెప్పాకా కోపం కొంచెం చల్లారి, వాడు దరిద్రుడి శవం వున్న చక్రాల బండిని విసుగ్గా అటూ ఇటూ తోస్తూ శవాలగదివైపుకి తీసుకెడుతుండగా శ్రీమన్నా రాయణగారి అంతిమయాత్ర ఇందిరా ధర్మాసు పత్రి సెంటరుకి చేరింది. చక్రాలబండిని విసురుగా ఓ తోపుతోసి అదిచూడ్డానికి రోడ్డు మీదకు నడిచాడు వాడు.

అలా తోటీవాడు విసురుగా తొయ్యగానే రంయినపోయి చక్రాలబండి గోడకు గుద్దుకుంది. ఆ కుదుపుకి ముక్కు మీదున్న కొనప్రాణం పోయి దరిద్రుడు బరువు దించు కున్నట్లు శరీరం వదలి, 'థాంక్స్' అంటూ హుషారుగా గాలిలోకి ఎగిరాడు. అలా ఎగురుతున్న వాడికి వాహనం మీద తన భౌతికకాయం పక్కన కూర్చుని కన్నీరు కారుస్తున్న శ్రీమన్నారాయణగారు కనుపించారు.

'హాయ్ - చచ్చిపోయా,' అన్నాడు దరిద్రుడు శ్రీమన్నారాయణగారి పక్కనవాలి.

'అయ్యో - చచ్చిపోయా,' అన్నాడు దరిద్రుడు శ్రీమన్నారాయణగారి పక్కనవాలి.

'అయ్యో - చచ్చిపోయా', అన్నారు శ్రీమన్నారాయణగారు సమాధానంగా.

'గ్లాడ్‌టు మీట్‌యు - నా పేరు డి. నారాయణ, బి.ఏ', అన్నాడు దరిద్రుడు శ్రీమన్నారాయణ గారికి షేక్ - హాండిస్తూ.

'నా పేరు యస్. నారాయణ - నిన్ను కల్సుకోవడం నాకేమాత్రం సంతోషంగా లేదు' అన్నారు శ్రీమన్నారాయణగారు చెయ్యి విదిలించుకుని కళ్ళు తుడుచుకుంటూ.

'ఏవిట్రా పిచ్చివాడా - చచ్చిపోయిన వాడివి హాయిగా గాలిలో తేలిపోక ఏడుస్తూ కూర్చున్నావు'? అన్నాడు డి. నారాయణ నవ్వుతూ.

'నాకు చావాలనిలేదు', అన్నారు యస్. నారాయణ ఏడుస్తూ,

'శరీరం ఆత్మకి చొక్కాలాంటిదిరా - చచ్చిపోవడమంటే పాతచొక్కా వదలి కొత్త చొక్కా తొడుక్కోడమన్న మాట - కొత్త చొక్కా తొడుక్కుంటున్నందుకు సంతోషించక ఏడుస్తావేంట్రా పిచ్చివాడా !'

'నాకు పాత చొక్కాయే బావుంది', అన్నారు శ్రీమన్నారాయణగారు తన 'చొక్కా' కేసి కన్నీళ్లతో చూస్తూ.

దరిద్రనారాయణుడు శ్రీమన్నారా యణగారి భౌతిక కాయాన్ని పరిశీలనగా చూస్తూ, 'మనం ఇద్దరం నారాయణ స్వరూపాలవే కాని దేవుడు నీకు సిల్కుచొక్కా ఇచ్చి నాకు వెధవ చిరుగుల చొక్కా ఇచ్చాడేవిట్రా', అన్నాడు దిగులుగా.

## పాట

అనుభూతుల తోటలో
ఎగిరే సీతాకోక
* * *
గాలి హాయలు
కవిత్వం చేస్తూ
చెట్ల ఆకులు
* * *
అగ్గిపుల్ల వెలిగింది.
చుర్రుమని
విలవిల్లాడింది చీకటి దేహం.
* * *
లైటు వెలిగింది.
ఇక దీప శిఖ
ఒక మసక చిత్రం.

బి.వి.వి. ప్రసాద్.

'నీ కర్మ'

'అంతేనంటావా?'

'అంతే'

దరిద్రనారాయణుడు శ్రీమన్నారాయణగారి భౌతిక దేహం వున్న తెల్లటి పరుపుకేసి ఆశగా చూస్తూ, 'ఆ పక్క మీద కాసేపు పడుకోనా ? బతికున్నప్పుడు ఇంత తెల్ల పక్కమీద ఎప్పుడు పడుకోలేదురా', అన్నాడు.

'పడుకో', అన్నారు శ్రీమన్నారాయణ గారు విసుగ్గా.

తెల్లటి దుప్పటిలో దూరిపోయి, కాలు మీద కాలు వేసుకుని పడుకుని కొంత దూరం ప్రయాణం చేసి, అంతలో తన చొక్కా గుర్తుకొచ్చి - 'అరేసుకోబోయి పారేసుకున్నాను హరీ ... హరీ....' అని పాడుతూ పగలబడి నవ్వడం మొదలుపెట్టాడు దరిద్రుడు.

'వెధవపాట ఆపు', - అరిచారు శ్రీమన్నారాయణగారు దుఃఖంతో.

దరి...డికి శ్రీమన్నారాయణగారిని చూస్తే జాలేసింది - 'పోనీ ఓ పని చెయ్యకూడదురా పిచ్చివాడా - బతికేద్దువుగాని' అన్నాడు.

'ఏవిటి?'- ఆశగా అడిగారు శ్రీమన్నారాయణగారు, ఇంకో ఆర్నెల్లు బతికితే తను సి.యం. అయ్యే వాణ్ణన్న అభిమానుల మాటలు గుర్తుకు తెచ్చుకుంటూ.

'నీ చొక్కాకి టైమైపోయింది - అది నీకు ఇంక పనికిరాదు - నా చొక్కా ఆస్పత్రి వాళ్ళు దయతో తొందరపడి విప్పేశారు కాని ఇంకా టైముందిరా - అంత సరదా పడుతున్నావు - పోనీ నువ్వు నా చొక్కా వేసుకు తిరగకూడదా ?'

'ఎలా?'

'ఎలా ఏవిట్రా పిచ్చివాడా - ఇన్ని పార్టీలు మార్చిన వాడివి నన్నడుగుతావేం - పరకాయ ప్రవేశం చెయ్యరా డింభకా'

'నిజంగా నీ చొక్కా ఇచ్చేస్తున్నావా ;' - ఒక్క ఉదుటున లేచి అడిగారు శ్రీమన్నారాయణగారు, దరిద్రుడు మళ్ళీ మనసు మార్చుకోకముందే చొక్కా తొడిగేసుకోవాలన్న ఆత్రతతో.

'నిజంగానే రా - నే బతికినంతొట్టు - అచ్చంగా నీదే' అన్నాడు దరిద్రుడు శ్రీమన్నారాయణగారు లాంగ్‌జంప్ చేసి వాహనం మీంచి ఆస్పత్రి గేటు మీదకు దూకారు.

'ఒరే పిచ్చివాడా - మన ఎడ్రసు తెల్సుగా బ్రాంచి నెంబరు 7, ఊడలమర్రి, ముప్ప య్యారోవార్డు - అంటే తెల్సుగా .... హ్హ ... హ్హ ....' ' - తన జోకుకి తనే విరగబడి నవ్వి - 'నన్నెప్పుడైనా కలవాలనిపిస్తే అక్కడికి వచ్చేసేయ్ - టా... టా.. ఛీరియో .....' అని శ్రీమన్నారాయణగారికి వీడ్కోలు చెప్పి, 'హరీ ... హరీ' అని పాడుకుంటూ ముప్పయ్యారో వార్డు వేపుకి సాగిపోయాడు దరిద్రుడు.

శ్రీమన్నారాయణగారు దరిద్రుడి శరీరంలోకి ప్రవేశించడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తుండగా తోటీవాడు తిరిగి వచ్చి, విసుగ్గా చక్రాలబండిని ఓ గెంటుగెంటాడు. బండి ఈ సారి పక్కనున్న గోడకు దభీమని గుద్దుకుంది. ఆ కుదుపుకి శ్రీమన్నారాయణగారి ఆత్మకి దరిద్రుడి శరీరంలోకి దారి దొరికింది.

'పొద్దుటే ఎవడి మొహం చూసేనోకాని టీ డబ్బులు కూడా రాల్లేదు - ఉన్నోడికే కాని లేనోడికి ఎవడూ కానీ విదల్చడురా నాయనా ..... అని శవాల సంపాదన మీదే రెండిళ్ళు కట్టిన విషయం మర్చిపోయి బాధపడి, 'పోనీ బాడీయేనా వుందా?' అనడిగాడు తోటీవాడు.

శవం జేబులన్నీ తడిమి, సగం కాలిన బీడీముక్క జేబులోంచి లాగి, 'ఛీ' అని విసిరెయ్యబోయి, మళ్ళీ ఆలోచించి, 'సచ్చినోడి దగ్గర్నుంచి ఏదొచ్చినా లాబవే' అని బీడీ ముక్క చెవిలో పెట్టి, 'సొంత డబ్బులతో టీ తాగొస్తా కాని నువ్వెళ్లి శవాల గదిలో పడుకో - విసిగించక' అని శవానికి చెప్పి, టీ తాగడానికి పోయాడు తోటీవాడు.

శవంలోపలున్న శ్రీమన్నారాయణగారు ఊకొట్టి, వాడు వెళ్ళిపోగానే బండిదిగి త్వర త్వరగా ఆస్పత్రి లోంచి బయటకు నడిచారు.

దరిద్రుడి కళ్ళలోంచి చూస్తున్న ప్రపంచం శ్రీమన్నారాయణగారికి వింతగా కనుపించింది.

'నిన్నటిదాకా ఏ.సీ బంగ్లాలు, పడవ కార్లు, ఫైవ్‌స్టార్ హోటల్సుతో, పిటపిటలాడే పడుచుల సిల్కు చీరల రెపరెపలతో టీవీ ఎడ్వర్టయిజ్‌మెంటులా కలకలలాడుతుండే దేశం నేను పదవిలో లేని ఒక్కరోజులోనూ ఇంత పాడైపోయిందేవిటి? ఈ మురికి వాడలూ, ఈ ఎండిన మనుషులు, ఈ దరిద్రం - ఇదేవిటి?' అని ఆశ్చర్యపోతూ తన కోటవేపు నడిచారు ఆయన.

అలా నడిచి, నడిచి, నీరసంగా గేటు తీసుకుని లోపలకు వెళ్ళబోతుంటే గేటు దగ్గర గూర్ఖావాడు లాఠీ అడ్డుపెట్టి, 'ఎవర్రా నువ్వు?' అని కళ్ళెర్రజేశాడు.

'నేను ...... కనిపించడంలా ...... శ్రీమన్నారాయణని', అన్నారు శ్రీవారు.

చిరిగిపోయిన బట్టలు, మాసిపోయిన తల, ఎండిపోయిన నల్లని శరీరం, లోతుకు పోయిన కళ్ళు - ఆయన ఆకారం చూసి అంతా గొల్లున నవ్వారు.

'పాపం - పిచ్చాడితో నీకేవిటి?' అని గూర్ఖావాడితో ఎవరో అంటుండగా, 'ఏవిటి గొడవ?' అంటూ అరుంధతీదేవి పోర్టికోలోంచి అరిచింది.

ఆవిడ కనుపించగానే శ్రీవారికి ఎక్కడలేని ఓపికా వచ్చింది. గూర్ఖావాణ్ణి తప్పించుకుని మెరుపులా ఆవిడ దగ్గరకి పరిగెట్టి, 'నేనేనే భువన సుందరీ' అన్నారు శ్రీమన్నారాయణగారు ఆవిడ చెవిలో.

ఆవిడని 'భువనసుందరీ' అని ఏకాంతంలో శ్రీవారు తప్ప ఎవరూ పిలవరు. అంచేత ఆయన్ని తరుముకు వస్తున్న గూర్ఖాని పొమ్మని చెప్పి, శ్రీమన్నారాయణగారికేసి తిరిగి, 'ఎవరు నువ్వు?' అంది ఆవిడ అనుమానంగా.

'నేనేనే అరుంధతీ - నీమొగుణ్ణి .... అంటూ, ఆవిడకీ, ఆయనకీ, మూడోకంటి వాడికీ మాత్రమే తెల్సిన రహస్యాలు ఋజువుగా చెప్పి, 'బతికొచ్చేసేనే అరుంధతీ - ఇంకో నెల్లో నేను సి.యం.నవకపోతే చూడు', అన్నారు ఆనందంగా.

అవన్నీ విన్నాకా, ఎదురుగా ఉన్నది నిజంగా శ్రీవారేనని నమ్మకం కుదిరాకా, ఆవిడ గొల్లుగొల్లున ఏడ్వడం మొదలుపెట్టింది.

'ఏడవకే పిచ్చిమొహ౦నా - వచ్చేశాగా' అని శ్రీవారు ఓదార్చబోతుండగా మొదలు పెట్టింది ఆవిడ - 'ఓరి సచ్చినాడో - సచ్చినోడివి సావకుండా మళ్ళీ ఇలా బతికి సచ్చావేంట్రా సచ్చినాడో' పార్టీవోళ్ళు నాకు పట్టాభిషేకం

సేద్దామనుకుంటుంటే ఇప్పుడెలా స్మెసానం లోంచి ఎందుకు తగలడ్డావురా సచ్చినాడో', అంటూ గొల్లుగొల్లున ఏడ్చి, గూర్ఖాని పిల్చి బయటికి గెంటెయ్యమనీ, మళ్ళీ వస్తే కాళ్ళూ చేతులూ విరిచెయ్యమనీ చెప్పి, ఆయన మొహం మీదే తలుపేసేసింది అరుంధతీ దేవి.

ఆ ఇంటి తలుపులేకాదు - 'చొక్కా' మారగానే తానంతవరకూ మసిలిన స్వర్గం తలుపులు తనకు మూసుకుపోయి, తనెన్నడూ చూడని నరకం తలుపులు తెరుచుకున్నాయన్న సంగతి ఆయనకు స్పష్టమైంది. ఆయనకు ఎక్కడికి వెళ్ళాలో, ఏం చెయ్యాలో అర్థం కాలేదు. దిగాలుగా రోడ్డుమీద నడుస్తుంటే కళ్ళు తిరిగి నట్లయింది. కడుపులో ఏదోలా అనిపించ సాగింది. విపరీతమైన నీర్సం అనిపించింది.

'ఇప్పుడే బతికాను - మళ్ళీ ఏవైంది నాకు', అని ఆయన ధర్మాసుపత్రి వైపుకి దారితియ్యబోయారు కాని వాళ్ళు తనని గుర్తుపట్టి శవాల గదిలో పడేస్తారేమోనన్న భయంతో ఆ ప్రయత్నం విరమించుకుని నడక కొనసాగించారు.

అలా తూలుతూ నడుస్తూ, ఎంత కాలం, ఎంతదూరం వెళ్ళి ఎప్పుడు స్పృహతప్పి పడిపోయారో గుర్తులేదు కాని తిరిగి ఆయన కళ్ళు తెరిచేటప్పటికి భూతంలా ఉన్న ముసిలాడు ఆయన మొహంలో మొహం పెట్టి చూస్తున్నాడు.

'నాకేవైంది?' అనడిగారు శ్రీవారు.

ముసిలాడు సమాధానం చెప్పకుండా సూపర్స్పెషలిష్టులా ప్రశ్నలడగడం మొలు పెట్టాడు.

'నీర్సంగా ఉందా ?'

'ఊ .......'

'తల తిరుగుతోందా ?'

'ఊ .......'

'కాళ్ళు వణకుతున్నాయా ?'

'ఊ ..... ఏవైంది నాకు ..... పెద్ద జబ్బా...... ' అనడిగారు శ్రీవారు కంగారుపడుతూ.

'పెద్ద జబ్బేంకాదు ....... మామూలు జబ్బే ....... ఆకలి', అన్నాడు ఆకలి స్పెషలిష్టు నవ్వుతూ.

## 3

**ఆరునెలల తర్వాత ఓ అమావాస్యరోజు**

అర్ధరాత్రి ముప్ఫయ్యారోవార్డులో 'హారిబుల్ .... మోస్ట్ హారిబుల్' అనే పెనుకేక సమాధుల మధ్య ప్రతిధ్వనించింది.

మర్రి చెట్టు ఊడలు పట్టుకుని ఉయ్యాలలూగుతున్న దెయ్యం ఒకటి ఉలిక్కిపడి అటూ ఇటూచూసి, 'మనిషి .... మనిషి......' అని భయంతో కీచుగా అరుస్తూ మాయమైపోయింది. నడిరేత్రి తమ తమ పనుల్లో మునిగివున్న దెయ్యాలు ఆ కేకవినగానే ఉలిక్కిపడి ఎక్కడివక్కడే ఆగిపోయాయి.

చిటారు కొమ్మమీద పడుకున్న దరిద్రుడు కొంచెం కళ్ళు తెరిచి 'ఏవిటి గొడవ?' అని తన కొమ్మమేటుని అడిగాడు.

'కొమ్మలంటుకున్నా లేవవు నువ్వు - నడిరేత్రి, కాళ్ళక్రింద కొచ్చినా ఇంకా బద్ధకమే ..... లే ..... లే....' అని మందలించి, 'ఎవరో మనిషి వచ్చాడు', అని దెయ్యాలలోకంలో కలవరానికి కారణం వివరించాడు కొమ్మమేటు.

దరిద్రుడు ఓసారి ఆవలించి, కొమ్మ మీంచి కిందకు చూసి, శ్రీవార్ని గుర్తుపట్టి, సంతోషంతో కిందకు దూకి ఆయన్ను కౌగలించుకుని, 'ఏరా పిచ్చివాడా - బావున్నావా', అని పరామర్శించి, 'ఏవిటిరా చొక్కా ఇలా మాపేశావు? అని దిగులుగా ఆయన ఒళ్ళంతా తడిమాడు.

శ్రీవారి గెడ్డం బాగా పెరిగిపోయింది. మహామాంత్రికుడి జుట్టులా కేశ సంరక్షణలేక జుట్టు అట్టలు కట్టింది. కళ్ళులోపలకి పోయి ఎర్రగా మండుతున్న కట్టెల్లా ఉన్నాయి. శరీరమంతా చిక్కిపోయి, ఎముకలు కనుపిస్తున్నాయి.

దరిద్రుడి ప్రశ్నకు సమాధానం చెప్పకుండా శ్రీవారు, 'హారిబుల్ - మోస్ట్ హారిబుల్' అనరిచాడు మళ్ళీ ఆవేశంగా.

'ఏవిట్రా హారిబుల్ పిచ్చివాడా - అలా గింజుకుంటున్నావు?' అనడిగాడు దరిద్రుడు నవ్వుతూ.

'ఇది దేశవాఁ? వల్లకాడా?' - శ్రీవారు గర్జించారు.

# విజయనగరం జిల్లాకు గురజాడ పేరు పెట్టండి

విజయనగరం జిల్లా పేరును ఇటీవల మరణించిన పివిజి రాజు పేరుతో విజయరామ గజపతి నగరంగా మార్చాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని అరసం, విరసం, జనసాహితి ప్రజారస సాహిత్య సంస్థలు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖ కవులు, రచయితలు ఒక పత్రికా ప్రకటనలో ఖండించారు. విజయనగరం జిల్లా అందించిన ఎందరో ప్రముఖులలో మహోన్నతుడు గురజాడ అప్పారావు. గురజాడ అడుగుజాడల్లో ఆంధ్ర సాహితీ కళాసంపద పెనవేసుకుపోయింది. కథకు, ఆధునిక నాటకానికీ, వ్యవహారిక భాషకూ ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగు జాతికి ఆధునిక 'చూపు'నిచ్చిన వేగు చుక్క గురజాడ. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయనగరం జిల్లా పేరును మార్చదలుచు కుంటే తెలుగు సంస్కృతిలో అణువణువున జీర్ణించిన గురజాడ వారి పేరును నిర్ణయించవలసిందిగా కోరుతూ దాదాపు 60 మంది సాహితీ ప్రముఖులు సంతకాలు చేసిన ప్రకటనను ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడుకు పంపారు.

ఈ ప్రకటనపై సంతకాలు చేసిన వారిలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం గుంటూరు జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, తిరుమల రామచంద్ర, పెద్దిభొట్ల సుబ్బ రామయ్య, మధురాంతకం రాజారాం, పోరంకి దక్షిణా మూర్తి, కాలువమల్లయ్య, శశిశ్రీ, శ్రీవిరించి, చిలుకూరి దేవపుత్ర, పాపినేని శివశంకర్, శివారెడ్డి, శిఖామణి, ఆశారాజు, బమ్మిడి జగదీశ్వరరావు, కాత్యాయని, వర్మ, జీవన్, నాగభైరవ కోటేశ్వరరావు, రావెల సాంబశివరావు, తదితరులున్నారు.

'వల్లకాదే' - ఓ దెయ్యం జోకేసి పగలబడి నవ్వసాగింది.

'లార్జెష్టు డెమోక్రసీని పట్టుకుని అలా అంటావేంట్రా - తప్పురా', అని జోకేసిన దెయ్యాన్ని దరిద్రుడు మందలిస్తుంటే శ్రీవారు - 'డెమోక్రసీయా గాడిదగుడ్డా -పైన ఉన్న వాడికి స్వర్గం, లేని వాడికి నరకం - ఇదేం డెమోక్రసీరా వల్లకాట్లో డెమోక్రసీ.......

'సీ .... సీ... డెమోక్రసీ ....... సీ....... సీ.... డెమోక్రసీ.......' - నాలుగు దెయ్యాలు లేచి పాడుతూ బ్రేక్‌డాన్సు చెయ్యసాగాయి.

'ఉష్ - గొడవచెయ్యకండ్రా', అని వాటిని మందలించి శ్రీవారికేసి తిరిగి, 'బావుంది థ్యేయ్ - నిన్ను సంపాదించొద్దని ఎవడన్నాడు ? నువ్వూ తాతా, బిర్లా, అంబానీ అంతటివాడివి వావచ్చు - అయినా ప్రపంచమంతా ఫ్రీడం, డెమోక్రసీ అని పరుగులు తీస్తుంటే, నువ్వేవిట్రా, ఇంకా తిండీ, గుడ్డా అని పాత ఏడుపులు ఏడుస్తున్నావు .....' అన్నాడు దరిద్రుడు.

శ్రీవారు అగ్గినిప్పయిపోయారు - 'నాలుగు మెతుకుల కోసం కుక్కకన్న హీనంగా బతికేవాడికి ఫ్రీడం ఏవిటిరా నీ పిండాకూడు - వెధవ పేపరు కబుర్లు చెప్పకు ......'

'డమ్ ..... డమ్ ..... డమాడమ్ ....ఫ్రీడమ్ .... డమాడమ్ .....' - దెయ్యాలు ట్యూను మార్చి డాన్సు చెయ్యసాగాయి.

'ఉడండ్రా ! మాట తొంగనివ్వకుండా వెధవగోలా మీరూను ....' అని దరిద్ర నారాయణుడు వాటిని మందలిస్తుంటే, '.... ఈ నాకొడుక్కి సచ్చిబతికి సావడానికి సిద్ధవయ్యాకా ఇప్పుడు కళ్ళు తెరుచుకున్నాయా అని నేను మూడో బ్రాంచి మీంచి లోళ్ళవు చేస్తున్నాను', అని మూడవ బ్రాంచి మీంచి ఓ కేక వినిపించింది.

'ఎవరది?' - శ్రీవారు ఆగ్రహంతో ప్రశ్నించారు.

'మీ జాతివాడే - ఆపొజిషన్ వాడు - వాడుతాగిన సారా నిషా వాడి ఆత్మకు కూడా ఎక్కేసింది - అందుకని అలా వాగుతుంటాడు - ఏవనుకోకుకాని సి.యం.నవుతానన్నావుకదరా - ఏవైంది?' అనడిగాడు దరిద్రుడు, శ్రీవారి ఆవేశం తగ్గించడానికి మాట మారుస్తూ.

'నీ చొక్కాతో పాటు నీ దరిద్రపు జాతకం కూడా తగిలించాకా ఇంక సి.యం. ఎలా అవుతాను ? నీ వెధవ చొక్కా నువ్వు తీసేసుకో' , అన్నారు శ్రీవారు మండిపడుతూ.

'ఒకసారి అచ్చంగా ఇచ్చేశాకా మళ్ళీ ఎలా తీసుకోనూ - తప్పుకాదూ'.

'తప్పులేదు, గిప్పులేదు - నాకీ లోకంలో ఎలా బతకాలో తెలియడం లేదురా' - శ్రీవారు దీనంగా అంటుండగా, మళ్ళీ మూడో బ్రాంచి మీంచి, 'ఈ నాకొడుక్కి .........' అని కేక వినిపించింది.

'ఒరేతప్పురా ! ఇదేవన్నా పార్లమెంటా, ఎసెంబ్లీయా నీ నోటికొచ్చినట్టు మాట్లాడడానికి ....' అని మూడో బ్రాంచి ఆపొజిషన్ దెయ్యాన్ని మందలించి, 'చిలక్కి చెప్పినట్టు చెబుతున్నా, 'నాకు చావాలని లేదు, నాకు చావాలని లేదు .....' అని గొల్లుమన్నావు - ఖర్మ అనుభవించు....' అన్నాడు దరిద్రుడు.

'ఓరి దరిద్రుడా - నీ కర్మ నేనను భవిస్తున్నాను కదరా - నీ చొక్కా నువ్వు తీసుకుని నీ కర్మను నువ్వే అనుభవించు ...

'అలాగంటే ఎలాగా - చిరిగి పోయేదాకా వేసుకోకతప్పదు....'

'నీ చొక్కా నువ్వు తీసుకుంటావా లేదా' , అని శ్రీమన్నారాయణగారు కళ్ళెర్రజేసి దరిద్రుడి పీక పట్టుకోబోయారు. ఆయన చేతికి ఏవీ తగల్లేదు. దరిద్రుడు గొల్లున నవ్వి మాయమై పోయాడు. మిగిలిన దెయ్యాలన్నీ కూడా మాయమైపోయి, శ్రీవారు శ్మశానంలో ఒంటరిగా మిగిలిపోయారు. అప్పుడు తెల్లవారబోతోంది.

ఆయన దరిద్రుణ్ణి తిట్టుకుంటూ, కాళ్ళీడ్చుకుంటూ, ఊళ్ళోకి దారితీశారు. అలా నీరసంగా నడుస్తూ దేవాలయం దాకా వచ్చి అక్కడ స్పృహ తప్పి పడిపోయారు.

సాయంత్రం వేళలో అలవాటుగా దేవాలయానికి వెళ్ళి, ఓ గంటసేపు ధర్మోపన్యాసాలు విని, శాంతిపొందిన మనసుతో ఇంటికి తిరిగి వెడుతున్న ప్రముఖ సమాజ సేవకులు పద్మశ్రీ ధర్మారావుగారికి దేవాలయం మెట్లమీద అపస్మారక స్థితిలో పడున్న శ్రీమన్నారాయణగారు కనుపించారు.

'అయ్యోపాపం - ఈ దీనుడు ఇలా నిస్సహాయంగా పడివున్నాడే', అని ధర్మారావు కలతచెంది, శ్రీమన్నారాయణగారిని తన కారులో ధర్మాసుపత్రికి తీసుకుపోయి ......

'ఈడింతకు ముందోసారి నచ్చి పోయాడనుకుంటా ....' అన్నాడు తోటీవాడు శవం కేసి అనుమానంగా చూస్తూ. ఫ్రీగా శవాన్ని మోస్తే జన్మలో ఆ విషయం మర్చిపోలేడు వాడు. 'నాకూ అలాగే అనిపిస్తోంది', అంది నిర్లోలాక్ నర్సు ఆశ్చర్యంగా .

'ధర్మాసుపత్రిలో ఫ్రీగా సావొచ్చంటే సరదాపడి, కానీ ఇవ్వకుండా నన్నేడిపించడానికి మళ్ళీవచ్చాడు ఈడు. అసలు పేషంటు ఓసారికంటె ఎక్కువసార్లు సావగూడదని గవర్నమెంటు రిపోర్టు చెయ్యాలి. అప్పుడు ఎవరూ రెండేస్సార్లూ, మూడేస్సార్లూ సచ్చి మన్ను సంపరు' అన్నాడు వాడు.

'నువ్వు పెద్ద యూనియన్ లీడరునికదా - హైద్రాబాదులోనూ, ఢిల్లీలోనూ నీ పార్టీ వోళ్ళే గదా పవరులో వుంటా - ఆ ఎక్టు చేయిద్దువుగాని ఈ శవాన్ని మాత్రం తొందరగా శవాల గదికి చేర్చు - పేషంట్లంతా బయపడి సస్తున్నారు. అంది నిరోలాక్ నర్సు.

శవంకేసి తిరిగి, 'ఈసారేనా ఏవన్నా యిస్తావా - తొందరగా తీసుకెళ్ళిపడేస్తాను', అన్నాడు వాడు ఆశచావక.

'కానీ విదల్చను - నీ ఇష్టం వచ్చినప్పుడు తీసుకెళ్ళుబే', అన్నట్లు శవం కాళ్ళు నిగడదన్ని పడుకుంది కాని పెదవి విప్పలేదు.

వాడు శవం జేబులన్నీ వెతికాడు కాని ఏవీ దొరకక ఏడుపొచ్చింది వాడికి - 'ఇది వరకు సచ్చినప్పుడు బీడీముక్కయినా జేబులో ఏసుకుసచ్చావు- మాయరోగం ఇప్పుడేవొచ్చిందీ - జేబులు ఖాళీ', అని విసురుగా చక్రాల బండిని ఓ తాపు తన్నాడు.

రయిన పోయి చక్రాలబండి గోడకి గుద్దుకుంది. ఆ కుదుపుకి ముక్కుమీదున్న కొన ప్రాణం పోయి, శ్రీవారు బరువు దించు కున్నట్లు శరీరం వదలి, 'థాంక్స్' అంటూ హుషారుగా గాలిలోకి లేచి, మరి ఆలస్యం చెయ్యకుండా ముప్ఫయ్యారో వార్డుకి ఎగిరిపోయి, ఊడలమర్రి బ్రాంచి నెంబరు ఏడుమీద దరిద్రుడి పక్కన వాలి, 'వచ్చేశారా పిచ్చివాడా', అన్నారు వాణ్ణి కౌగలించుకుని. 'మంచి పని చేశావురా పిచ్చి వాడా', అన్నాడు దరిద్రుడు ఆయన్ని ఆహ్వానిస్తూ. ★